ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

ఆదివారం 25 మే 2025

రేపు ఇంటర్వ్యూలు

కథలాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాజీవ్ యువవికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న మైనార్టీ, క్రిస్టియన్ మైనారిటీ, ఎస్టీ, ఈబీసీలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు. అభ్యర్థులు ఆధార్, పాన్ కార్డులతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం వెంట తీసుకురావాలని కోరారు.

● **మల్యాల:** రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు.

పెద్దమ్మ తల్లి జాతర

కోరుట్ల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని యూసుఫ్‌నగర్‌లో శనివారం పెద్దమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సందీప్

కోరుట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సందీప్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కళాశాల సాధికార సమావేశం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కోరుట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణం పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సంఘ భవనంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యుల పరవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. ఆసుపత్రి జనరల్ ఫిజీషి యన్ నాగరాజు, జనరల్ లాప్రోస్కోపిక్ సర్జన్ ఉస్మానీ ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యుడు గుంటుక ప్రసాద్, కటకం వినయ్, బండ్ల రవి కుమార్, ఎక్కలదేవి రాంచందర్ పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి

రాయికల్, మే 24 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువుల విని యోగం తగ్గించాలని పొలాస వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలు పేర్కొ న్నారు. మండలంలోని మూటపెల్లి గ్రామంలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మోతాదులో ఎరువుల వినియోగం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, పంటల్లో చీడ పీడల నివారణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెక్కం తిరుపతి, రాజేందర్‌రెడ్డి, రంజిత్, బుచ్చన్న, రైతులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు అభినందనీయం

జగిత్యాల అర్బన్, 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీంరాజ్‌పల్లి గ్రామంలో బీబీకే (భీంరాజ్‌పల్లి బొమ్మెన కుమార్) ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు అభినందనీయమని రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి ప్రశంసించారు. అనంతరం ఆయన విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో బీబీకే ఫౌండర్ బొమ్మెన కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ఆశలు

● రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల కోసం వేలల్లో దరఖాస్తులు
● ఇప్పటికే మొదలైన లబ్ధిదారుల ఎంపిక
● సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు
● బ్యాంకుల షరతులతో దరఖాస్తుదారుల్లో అయోమయం
● జిల్లాలో తొలివిడతలో 1,430 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు
● రెండో విడత ఎంపికలో జాప్యం



జగిత్యాలలో ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

జగిత్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం ఆశావహులు పెద్ద సంఖ్యలో ఎదురుచూస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమంతో పాటు ప్రత్యేకంగా రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం ఇవ్వడంతో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ఎంపిక ప్రక్రియ పేరుతో నెలల తరబడి కాలయాపన చేస్తున్నారని పలువురు దరఖాస్తుదారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం సకాలంలో లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని పలువురు కోరుతున్నారు.

బ్యాంకులపైనే భారం

రాజీవ్ యువ వికాసం కింద నిరుద్యోగ యువతకు జీవనోపాధి కోసం సబ్సిడీతో కూడిన రుణాన్ని ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో రూ.50 వేల యూనిట్‌ను పూర్తి సబ్సిడీతో ఇవ్వనుండగా రూ.4 లక్షల వరకు రుణాలను కేటగిరీని బట్టి 70 శాతం వరకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించనున్నారు. ఇప్పటికే భారీ స్థాయిలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన, వడబోత ప్రక్రియ పూర్తి చేసి ప్రస్తుతం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీ శాఖల అధికారులతో పాటు సంబంధిత బ్యాంకుల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. అయితే ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా బ్యాంకుల గ్యారెంటీపైనే ఆధారపడినట్టు తెలుస్తోంది. లబ్ధిదారుడికి యూనిట్ మంజూరుపై బ్యాంకు అధికారులు అంగీకరిస్తేనే సబ్సిడీ రుణం అందనుంది.

కార్పొరేషన్ పేరు	యూనిట్ల లక్ష్యం	రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు
ఎస్సీ	4,402	11,300
ఎస్టీ	674	1,437
మైనారిటీ	764	3,922
బీసీ	7,013	31,128
మొత్తం	12,853	47,787

నియోజకవర్గాల వారీగా తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల వివరాలు..

నియోజక వర్గం	మంజూరు	ప్రారంభమైనవి
జగిత్యాల	327	103
కోరుట్ల	130	65
ధర్మపురి	599	112
చొప్పదండి	147	68
వేములవాడ	227	51
మొత్తం	1,430	399



జగిత్యాల మున్సిపాలిటీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

దక్కేది కొందరికే..

జిల్లాలో రాజీవ్ యువ వికాసం కింద వేల సంఖ్యలో దరఖాస్తులు రాగా ప్రభుత్వం మాత్రం లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులకు పరిమిత మైన లక్ష్యాలను నిర్దేశించింది. ఒక కార్పొరేషన్‌కు 30 వేల వరకు దరఖాస్తులు వస్తే ప్రభుత్వం మాత్రం 3 వేల లోపు లబ్ధిదారులకే రుణాలు మంజూరు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. యూనిట్ల ఎంపిక, దరఖాస్తుదారుల సామర్థ్యం తదితర విషయాలను పరిగణనలోకి తీసుకున్నాకే బ్యాంకులు రుణ మంజూరుకు ఆమోదం తెలపనున్నాయి. మండల స్థాయిలో లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యాక జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీ లబ్ధిదారుల జాబితాను ఫైనల్ చేయనుంది.

విడతల వారీగా ఇళ్లు

ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఒక్కో నియోజకవర్గంలో ఇప్పటికే వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. మొదటి దఫాలో ఇల్లు లేని వారు, గుడిసె, రేకుల ఇంట్లో నివసిస్తున్న వారికి అవకాశం ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. రెండో దశకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నారు. రెండో దశలో పక్కా ఇల్లు లేని వారు, సొంత జాగా లేని పేదలకు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. గ్రామాలు, మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఎంపీడీవోలు పూర్తిచేస్తారు. ఆ తర్వాత కలెక్టర్ లబ్ధిదారుల ఎంపికను పరిశీలిస్తారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షణలో తుది జాబితా రూపుదిద్దుకోనుంది. ఇందుకు మరికొన్ని రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. జిల్లాలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో జాప్యం చోటు చేసుకుంటున్నట్లుగా సంబంధిత వర్గాలు అంటున్నాయి.

లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది

సునీత, బీసీ సంక్షేమ శాఖ అధికారి



రాజీవ్ యువ వికాసం కింద వచ్చిన మొత్తం దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. ప్రభుత్వ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు సమగ్రంగా దరఖాస్తుల పరిశీలన చేపడుతున్నారు. బ్యాంకుల పరిశీలన పూర్తయిన తర్వాత ఆమోదం పొందిన వాటిని జిల్లా స్థాయి కమిటీకి పంపిస్తారు. తర్వాత లబ్ధిదారుల జాబితా విడుదల చేస్తాం.

కొండగట్టులో భక్తుల రద్దీ

పెద్ద జయంతి ఆదాయం రూ.1.51కోట్లు 6

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటపల్లిలో శనివారం నిర్వహించిన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామివారి కల్యాణం, మంటప నిర్మాణం, ధ్వజస్తంభం ఏర్పాటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు పాల్గొన్నారు.



దేశభక్తిని పెంపొందించడానికే

తిరంగా యాత్ర

బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు

రాయికల్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు

8

నేడు జీపీవో రాత పరీక్ష

హాజరుకానున్న 149 మంది అభ్యర్థులు

జగిత్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం గ్రామ పాలనాధికారి పోస్టుల భర్తీ కోసం రాత పరీక్ష నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాత పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందుగా పరీక్ష హాలులోకి అనుమతించబడుతారని, అభ్యర్థులు తమ వెంట 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొని రావాలని సంబంధిత అధికారులు సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌పై ఫొటో అతికించి, వారు పనిచేయు కార్యాలయ గెజిటెడ్ అధికారి సంతకం తీసుకొని రావాల్సి ఉంటుంది. హాల్ టికెట్‌ను సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. కో ఆర్డినేటర్ అధికారిగా జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ వ్యవహరిస్తున్నారు. జిల్లాలో 149 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. 9 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

గ్రామ పాలనాధికారి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్

జగిత్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): గ్రామపాలనాధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. దీనికి జిల్లా నుంచి కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, సంబంధిత అధికారులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలను, 9.20 గంటల వరకు ప్రశ్నాపత్రాలను తరలించాలని అన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్‌చేసి జేఎన్టీయూహెచ్‌కు అందించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల రూట్లలో తగినన్ని బస్సులు నడపాలన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ షాపులు మూసి వేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



జైనా గ్రామంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొప్పుల

ధర్మపురి, మే 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ధర్మపురి మండలంలోని జైనా, మగ్గిడి-ఎడపెల్లి, దొంతాపూర్ గ్రామాల్లో అకాల వర్షం వల్ల తడిసిన వరి ధాన్యాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో నెలల తరబడి జాప్యం చేస్తున్నారని విమర్శించారు. వరి పంట కోసి నెల రోజులు గడుస్తుండగా ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదని అన్నారు. ఈదురు గాలులతో వర్షం కురిసి వరి ధాన్యం తడిసి ముద్ద అయ్యిందని ఆయన తెలిపారు. ధాన్యం తడిసి మొలక వచ్చి రైతులు తీవ్ర నష్టం వాటిల్లి ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. నియోజక వర్గంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు నిల్వలు అలాగే ఉన్నాయని, లారీల కోసం రైతులు ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయన సివిల్ సప్లయిస్ డీసీవో, డీఎంలతో ఫోన్‌లో మాట్లాడి జైనా కొనుగోలు కేంద్రాల్లో 2600 బస్తాల ధాన్యం తూకం వేసి ఉందని తెలిపారు. త్వరగా లారీలను ఏర్పాటు చేసి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని ఆయన కోరారు. ఆయన వెంట ధర్మ పురి ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, మాజీ ఎంపీపీ సౌళ్ల భీమయ్య, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, మాజీ ఎంపీటీసీ కుక్కల గంగారెడ్డి, మాజీ సర్పంచ్ కురిక్యాల మహేష్, ర్యాగల్ల నారాయణ పాల్గొన్నారు.

'గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి'

మెట్‌పల్లిటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని శనివారం మెట్‌పల్లి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగికి, తహసీల్దార్ శ్రీనివాస్‌కు, మెట్‌పల్లి సీఐ అనిల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రఖండ కార్యదర్శి మర్రి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు పోహార్ తుకారాం, నగర అధ్యక్షులు అరిగేల సత్యనారాయణ,నగర ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, నగర కార్యదర్శి వేములవాడ రాజశేఖర్, గో రక్షక ప్రముఖ్ బోడ్ల రమేష్, గొనె వినయ్, వంశీ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి

జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్

మెట్‌పల్లిటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను తయారు చేసి అందించాలని జిల్లా వ్యవసాయధికారి వి.భాస్కర్ సీడ్ ప్లాంట్ యాజమానికి సూచించారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలోని సాయి సీడ్ కార్పొరేషన్ ప్లాంట్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాసెసింగ్ ప్లాంట్‌ను, రా సీడ్ మెటీరియల్, బ్యాగ్‌లను పరిశీలించారు. రిజిస్టర్ బుక్‌లు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రమేష్, ఎంఏఓ దీపిక తదితరులు పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) నాణ్యమైన విత్తనాల తయారీపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులకు సూచించారు. శనివారం కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలోని అయ్యప్ప సీడ్స్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ జగిత్యాల ఏడీఏ తిరుపతి, కోరుట్ల, మెట్‌పల్లి ఏవోలు నాగమణి, దీపికలతో కలిసి పరిశీలించారు. ప్లాంట్‌లో తయారు చేసి నిలువ ఉన్న సీడ్స్‌ను తనిఖీ చేసి వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి భాస్కర్ ప్లాంట్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్‌లో జరిగే విక్రయాలను వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి బిల్లులను అందించాలని సూచించారు. ప్లాంట్‌లో తయారు చేస్తున్న సీడ్స్‌ను సూచిక బోర్డుపై ఉంచి వాటి రేట్లను ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతి సీడ్‌పై తయారీ తేదీని ప్రచురించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నరేశ్‌లతో పాటు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



స్టోరీ కార్డులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శ కులని, నూతన విద్యా విధానంలో వారి పాత్ర కీలకమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. నూతన పద్ధతుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనలు సాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, డీఈవో రాములు నాయక్, ఎంఈవో రాఘవులు, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజరెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశం, అచ్యుత రావు, కోల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మహేంద్ర బాబు, చంద్ర తేజ, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో రాయికల్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు దొంతి సతీష్ తయారు చేసిన ఆంగ్ల స్టోరీ కార్డులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ వినూత్న కార్డులు చిన్న పిల్లలకు చదువును సరదాగా మార్చడానికి, ప్రాథమిక విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఉద్దేశించ బడ్డాయన్నారు. ఈ సందర్భంగా సతీష్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

రైతులు భూ సర్వేకు సహకరించాలి

-అదనపు కలెక్టర్ బీఎస్ లత

బీర్‌పూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): రైతులంతా భూ సర్వేకు సహకరించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలంలోని కోమన్‌పెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన భూ సర్వే పైలట్ ప్రాజెక్ట్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైనా కోమన్‌పెల్లి గ్రామంలోని ప్రతి రైతుకు సంబంధించిన భూమిని కొలిచి సరిహద్దులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామలో సర్వే జరుగుతున్నప్పుడు రైతులు అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాహుల్, సర్వే అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన క్రేన్

● ఒకరికి గాయాలు

శంకరపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం గొల్లపల్లి గ్రామ శివారులో శనివారం కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై కారును క్రేన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన బెజ్జంప్రకాష్ అతడి కుమారుడు బెజ్జం సుధీర్ ఇద్దరు వేములవాడకు వెళ్లి దర్శనం చేసుకొని తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో గొల్లపల్లి గ్రామశివారు దగ్గర ఎదురుగా వస్తున్న క్రేన్, కారును ఢీకొట్టింది. ఈఘటనలో కారులో ప్రయాణిస్తున్న ప్రకాష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బ్లూకోల్ట్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని 108కు సమాచారం అందించారు. ప్రథమచికిత్స అందిస్తూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన ఓ గీత కార్మికుడు శుక్రవారం రాత్రి తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయపడ్డాడు. గ్రామానికి చెందిన బాలగోని రాములు వృత్తిలో భాగంగా కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారి కిందపడ్డాడు. గమనించిన తోటి గీతకార్మికులు 108కు, కుటుంబసభ్యులకు సమాచారం అదించారు. చికిత్సనిమిత్తం రాములును హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

వేములవాడలో మూడిళ్లలో చోరీ

వేములవాడ, మే 24 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు ఇళ్లలో చోరీ జరిగింది. సాయినగర్ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలోని ఒక కిరాణా దుకాణం తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగ ఐదు వేల రూపాయల నగదు అపహరించినట్లు తెలిసింది. పక్కనే ఉన్న మరో ఇంట్లో చీరల దుకాణం నిర్వహిస్తుండగా, ఆ ఇంట్లోకి ప్రవేశించిన దొంగ చీరలు ఎత్తుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఒకరి ఇంట్లో రెండు తులాల బంగారం, మరొకరి ఇంట్లో ఒక తులం బంగారం చొప్పున ఎత్తుకు వెళ్లినట్లు వెల్లడించారు. ఇంట్లోని వారు తాళం వేసి ఊరికి వెళ్లినట్లు గమనించిన దొంగ ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్, సాయినగర్ ప్రాంతంలో వారంరోజులుగా వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో భయాందోళనలకు గురవుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సాయినగర్‌లోని తాళం వేసిఉన్న మూడు ఇళ్లలో దొంగతనం జరిగిందని మొత్తం మూడుతులాల బంగారం, 5000 రూపాయల నగదు అపహరణకు గురైనట్లు ఫిర్యాదు అందిందని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

జనరల్ స్టోర్‌లో చోరీ

శంకరపట్నం, మే 24 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ జనరల్ స్టోర్‌లో శనివారం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట గ్రామానికి చెందిన కారుకూరి శ్రీనివాస్ కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. స్టోర్‌కు శుక్రవారం సాయంత్రం యధావిధిగా తాళం వేసి వెళ్లాడు. తెల్లవారుజామున పేపర్‌బాయ్ షాపు తెరిచి ఉందని శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. శ్రీనివాస్ షాపు వద్దకు వచ్చి చూడగా, క్యాష్ కౌంటర్‌లోని రూ.17వేల నగదు, రూ.20వేల విలువ చేసే జనరల్ స్టోర్ సామగ్రి, 5 హెల్మెట్‌లను దొంగలు దోచుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

సరస్వతి పుష్కరం.. సకలజన హితం


గోదావరిలో దీపాలను వదులుతున్న భక్తులు



- త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తజనం
- పదో రోజు 2 లక్షలకుపైగా హాజరైన భక్తులు

కాళేశ్వరం, మే 24 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కర సంబరం సాగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి అశేష భక్తజనం కాళేశ్వర క్షేత్రానికి పోటెత్తుతున్నారు. శనివారం పదో రోజు వివిధ ప్రాంతాలనుంచి సుమారు 2 లక్షలపైచిలుకు భక్తులు కాళేశ్వరంలో పుష్కర స్నానాలు ఆచరించి ముక్తీశ్వరుడిని కృపకు పాత్రులయ్యారు. భక్తులు రద్దీ అధికమై దర్శనానికి గంటలకొద్దీ సమయం పట్టడంతో క్యూలైన్‌లో వేచిచూడలేని భక్తులు కొంత మంది పుష్కర స్నానాలతో సరిపెట్టుకొని వెనుదిరిగి వెళ్లారు. పార్కింగ్ స్థలాలు సుదూరంగా ఉండటంతో కొంత మంది వాహణదారులు ఇబ్బందులు పడ్డారు. పలువురు ప్రముఖుల కాళేశ్వర క్షేత్రాన్ని సందర్శించి పుష్కర స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆది, సోమ రెండు రోజులతో పుష్కరాలు ముగియనుండటంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చే ఛాన్స్ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సర్వసతి పుష్కరాల పదో రోజులో భాగంగా శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎన్‌పీడీసీఎల్ సీఅండ్ఎండీ ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వరాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడిచిన 10రోజుల్లోనే 10 లక్షల పైచిలుకు మంది భక్తజనం పుష్కర స్నానాలు ఆచరించారు. పుష్కరసాన్నం ఆచరించేందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు ఆదివారం రానున్నారు.


ఎడ్లబండ్లపై పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు



కొండగట్టులో భక్తుల రద్దీ


ఆలయంలో భక్తులు

మల్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. హనుమాన్‌జయంతి ఉత్సవాలు ముగిసినప్పటికీ వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకపూజలు, సత్యనారాయణ వ్రతాలుచేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షించారు.

● పెద్ద జయంతి ఆదాయం రూ.1.51కోట్లు

కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 20నుంచి 22వరకు జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దేవస్థానంకు రూ.1,51,72,470 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. దీక్ష విరమణ టికెట్ల ద్వారా రూ.30,56,100, కేశఖండనం టికెట్ల ద్వారా రూ.8,51,450, ప్రత్యేక దర్శనం రూ. 23,04,800 ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ.79,14,200ల లడ్డు విక్రయాలు, రూ.10,45,920ల పులిహోర విక్రయాలు జరిగినట్లు వివరించారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయిప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. గతేడాది దేవస్థానానికి హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా రూ.1,51,38,490 ఆదాయం సమకూరింది.

డీడీఎన్ పథకానికి ముగిసిన గడువు

కరీంనగర్ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్ జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో అర్హతకలిగిన దేవాలయాలకు దూప,దీప,నైవేద్య పథకం వర్తింపజేసేందుకు రాష్ట్రప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయశాఖ మే1న నోటిఫికేషన్ జారీచేసింది. కాగా శనివారం సాయంత్రంతో ఈ దరఖాస్తుల సమర్పణకు గడువు ముగిసింది. సాయంత్రం 5గంటల వరకు సుమారు 300వరకు దరఖాస్తులు అందగా వాటిని ఉమ్మడిజిల్లా దేవాదాయశాఖ సహాయకమిషనర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్, అర్చకసంఘం నుంచి ఒక వ్యక్తిని తీసుకొని త్రీమెన్‌కమిటీగా ఏర్పడిఆలయాలను ఎంపిక చేయనున్నారు. ఎన్నికైన ఆయాఆలయాలకు నెలకురూ.4వేలు ధూప,దీప, నైవేద్యాలకు, అర్చక గౌరవభృతి కింద రూ.6వేలు చెల్లించనున్నారు. ఎంపిక విషయంలో పారదర్శకత పాటిస్తామని వదంతులు నమ్మవద్దని ఉమ్మడిజిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. వృద్ధుడి మృతి

సిరిసిల్ల క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామం సబ్‌స్టేషన్ వద్ద వద్ద శనివారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నర్రా అలియాస్ గడ్డి బుచ్చయ్య(60) అనే వృద్ధుడు మృతిచెందాడు. సిరిసిల్ల పట్టణం సర్దాపూర్ 17వ బెటాలియన్‌లో పనిచేసే కానిస్టేబుల్ తన ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనానికి ఢీకొనడంతో పెద్దూరుకు చెందిన బుచ్చయ్యకు తీవ్రగాయాలయ్యాయి. బుచ్చయ్యను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా, పెద్దూరు గ్రామస్థులు ఆందోళన చేస్తారనే సమాచారం మేరకు జిల్లా ఆసుపత్రి పోస్టుమార్టం గది వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురి డీబార్

గణేశ్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): శాత వాహనవిశ్వవిద్యాలయం పరిధిలో కొనసాగు తున్న డిగ్రీ రెండోసెమిస్టర్ పరీక్షల్లో శనివారం మాల్ ప్రాక్టీస్ చేసిన ఏడుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ వాగేశ్వరి డిగ్రీకళాశాల పరీక్ష కేంద్రంలో ఒకరు, అపూర్వ (ఉమెన్స్) డిగ్రీకళాశాలలో ఒకరు, అల్ఫోర్స్ (ఉమెన్స్) డిగ్రీకళాశాల కేంద్రంలో ఒకరు, పెద్దపల్లి ట్రినిటి డిగ్రీకళాశాలలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు చొప్పున డీబార్ అయినట్లు వివరించారు.

తక్కువ మార్కులు వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య

ముస్తాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపంచెందిన ఓవిద్యార్థిని ఉరివేసుకొని అత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన స్నేహిత(16) శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో తన స్నేహితుల కంటే తక్కువ మార్కులు వచ్చాయని కొద్దిరోజులుగా స్నేహిత బాధపడుతోంది. ఈక్రమంలో శనివారం తల్లిదండ్రులు పక్క ఊరిలోని బంధువుల ఇంటికి వెళ్లగా స్నేహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గణేష్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గన్నేరువరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుసుదాడి చేసి తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.25,470 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో తొమ్మిది మంది జూదరులు పట్టుబడగా మరోముగ్గురు పారిపోయారు. పట్టుబడిన వారిని గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గోపతి రవిందర్ తెలుపగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్‌ఐ అరుణ్ తెలిపారు.

ఖాసింపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పిడుగుపాటు

● స్వల్పంగా ధ్వంసమైన ఎల్‌టీ విద్యుత్‌పరికరాలు, ప్యానెల్ బోర్డు


గన్నేరువరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షంతో పాటు ఖాసింపేటలోని విద్యుత్‌సబ్‌స్టేషన్ సమీపంలో చింతచెట్టుపై భారీ శబ్దంతో పిడుగు పడింది. పిడుగుపాటుకు సబ్‌స్టేషన్‌లోని ఎల్‌టీ లైన్, అలారం ప్యానెల్ బోర్డు ధ్వంసం అయ్యాయి. దీంతో అర్ధరాత్రినుంచి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం ఉదయం హుటాహుటిన విద్యుత్‌అధికారులు రంగంలోకి దిగినూతన ప్యానెల్‌బోర్డు, ఎల్‌టీలను ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న జిల్లా విద్యుత్ అధికారులు ఎస్‌సి రమేష్‌బాబు, డీఈ తిరుపతి, మండల ఏఈ అంజనేయులు సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు.

మధ్యాహ్నం ఒంటిగంటవరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సకాలంలో స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించిన విద్యుత్ అధికారులను గ్రామస్థులు, రైతులు అభినందించారు.

పిడుగుపాటుతో ఎద్దులు మృతి

గంగాధర, మే 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కాచిరెడ్డిపల్లిలో శనివారం ఉదయం పిడుగుపడి రెండు ఎడ్లు మృతిచెందాయి. గ్రామానికి చెందిన దెశెట్టి వీరమల్లయ్య కాడెద్దులతో వ్యవసాయం చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం రెండు పశువులను రేకుల షెడ్డు వద్ద ఎప్పటిలాగే కట్టేశాడు. శనివారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో షెడ్డుపై పిడుగువేసింది. దీంతో షెడ్డులో కట్టేసిన రెండు పశువులు అక్కడికక్కడే మృతిచెందాయి. ఉదయం షెడ్డు వద్దకు వెళ్లిన రైతు వీరమల్లయ్య మృతి చెందిన పశువులను చూసి బోరున విలపించాడు. పశువుల విలువ సుమారు 1.50లక్షలు ఉంటుందని గ్రామ రైతులు తెలిపారు.

- అవయవాల ఎదుగుదలలో ముఖ్య పాత్ర
- నేడు థైరాయిడ్ డే



జీవక్రియ నియంత్రణలో కీలకం



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మానవ శరీరంలో రసాయన జీవక్రియలను నియంత్రిచండంలో థైరాయిడ్ గ్రంధి ఎంతో కీలకమైంది. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు శరీర మార్పులు చేయడంలో, అవయవాల ఎదుగుదలలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అయితే ప్రస్తుతం థైరాయిడ్ సమస్య ప్రపంచాన్ని పట్టి పీడిస్తోంది. అన్ని దేశాల్లోనూ ప్రజలు థైరాయిడ్ సమస్యతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి అవగాహన పెంచడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 25న థైరాయిడ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. థైరాయిడ్‌లో ఉండే కణాలు రక్తం నుంచి అయోడిన్‌ను గ్రహించి టైరోసిస్ అనే అమైనో యాసిడ్‌తో పాటు మరికొన్ని ఎంజైమ్‌ల సహాయంతో థైరాయిడ్ హార్మోన్లు టీ3, టీ4 వంటివి ఉత్పత్తి చేస్తాయి. ఈ టీ3, టీ4 హార్మోన్ల ఉత్పత్తిని నియంత్రించడానికి పిట్యూటరీ అనే గ్రంధి థైరాయిడ్ సిమ్యూలేటివ్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఈ థైరాయిడ్ టీ3, టీ4 హార్మోన్లు శరీరంలోని కొన్ని ప్రధానమైన జీవక్రియ జరిగేందుకు దోహదపడుతుంది. మన శరీరాన్ని చురుకుగా ఉంచడానికి తోడ్పడుతుంది. టీ3, టీ4 రక్తంలో హార్మోన్ల మోతాదు తగ్గితే కొన్ని సంకేతాలు పిట్యూటరీ గ్రంథికి చేరి అక్కడినుంచి టీఎస్‌హెచ్ హార్మోన్ ఎక్కువగా విడుదలయ్యేలా చేస్తుంది. దానివల్ల రక్తంలో టీఎస్‌హెచ్ మోతాదు పెరుగుతుంది. అప్పుడు రక్తంలో టీ3, టీ4 హార్మోన్ల మోతాదు పెరిగితే పిట్యూటరీ గ్రంధి నుంచి వచ్చే టీఎస్‌హెచ్ మోతాదు తగ్గుతుంది. దీంతో ఆ గ్రంథికి సంబంధించిన సమస్య వస్తుంది.

పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రావచ్చు...

- డాక్టర్ ఎ జైలొసింగ్(ఎండీ)



మానవ జీవక్రియల నియంత్రణలో కీలకపాత్ర పోషించే థైరాయిడ్ సమస్య వచ్చిందని పరీక్షల ద్వారా తెలుసుకొని మందులు వాడడం చాలా మంచిది. అశ్రద్ధ చేస్తే జీవక్రియలన్నీ సక్రమంగా పనిచేయవు. వైద్యుల సలహా మేరకు మందులు వాడడమే శ్రేయస్కరం. థైరాయిడ్ పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రావచ్చు. తల్లికి ఉంటే బిడ్డకు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పుట్టిన వెంటనే తల్లికి ఉన్నట్లయితే థైరాయిడ్ పరీక్షలు చేసి చికిత్సలు ప్రారంభిస్తే ఫలితం ఉంటుంది. లేదంటే పిల్లల్లో ఎదుగుదల మెదడు ఎదగకపోవడం వంటి సమస్యలు వస్తాయి. పెద్దవాళ్లు కూడా రకరకాల సమస్యలను ఎదుర్కొంటారు. నిరంతరం మందులు వాడడం మంచిది.

● థైరాయిడ్ సమస్యలు రెండు రకాలు..

హార్మోన్లు తగ్గడాన్ని హైపో థైరాయిడిజం అని, అవసరాన్ని మించి ప్రసవించడాన్ని హైపర్ థైరాయిడిజం అని లేదా థైరోట్యాక్సికోసిస్ అంటారు. హైపో థైరాయిడిజానికి అయోడిన్ లోపం సమస్య, హైపర్ థైరాయిడిజానికి రక్తంలో థైరాయిడ్ గ్రంధి యాంటీ బాడీస్ ఏర్పడడం. దీనిని హైపో ఇమ్యూన్ హైపోథైరాయిడిజం అంటారు. వీటిని రక్త పరీక్ష ద్వారా గుర్తిస్తారు.

దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బద్దిపెల్లివద్ద శుక్రవారం మహిళను బెదిరించి ఆమె వద్ద నుంచి 4 వేల రూపాయలు దోచుకున్న ఘటనలో నిందితుడు సందీప్‌ను శనివారం అరెస్టు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా ఆమెను చంపుతానని బెదిరించి రూ.4వేలు బలవం తంగా తీసుకొని సందీప్ పారిపోయినట్లు చెప్పారు.

చింతకుంట చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో సందీప్‌ను ఎస్సై సాంబమూర్తి అరెస్టు చేసినట్లు, రూ.3,500నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి

ఎల్లారెడ్డిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని మహిళ(40) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ప్రొబేషనరీ ఎస్‌ఐ లక్ష్మణ్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. వెంకటాపూర్ గ్రామ శివారులో మహిళ రోడ్డు దాటుతున్న క్రమంలో ఈనెల23న రాత్రి ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపు స్కూటీపై వెళుతున్న వ్యక్తి ఢీకొట్టాడు. తీవ్రగాయాల పాలైన మహిళను స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ శనివారం మృతిచెందింది. మహిళ ఒంటిపై గులాబీరంగు నైటీ, ఆమె రెండు చేతులపై హిందీలో 'బీ మాతా' అని పచ్చబొట్టు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ప్రొబేషనరీ ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. మహిళను ఎవరైనా గుర్తిస్తే తమను సమాచారం అందించాలని ఆయన కోరారు.



ఫైనల్‌కు శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్

కౌలాలంపూర్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. అప్పుడెప్పుడో 2019లో ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తెలుగు షట్లర్ కిదాంబి శ్రీకాంత్ ఆరేళ్ల తర్వాత ఓ బీడబ్ల్యూఎఫ్ టూర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరాడు. ఫామ్‌లేమికి చెక్ పెడుతూ, తన జోరు కొనసాగిస్తు కిదాంబి.. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్‌పోరుకు దూసుకెళ్లాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో 32 ఏళ్ల శ్రీకాంత్ 21-18, 24-22తో జపాన్‌కు చెందిన యుషి తనకను ఓడించాడు. ఆదివారం జరిగే తుదిపోరులో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

పంజాబ్‌కు పంచ్

విజయంతో ఢిల్లీ బైబై

రాణించిన సమీర్ రిజ్వీ • ముస్తాఫిజుర్‌కు 3 వికెట్లు



సమీర్ రిజ్వీ (58 నాటౌట్)

జైపూర్: టాప్‌-2లో నిలిచేందుకు పోటీపడుతున్న జట్లకు వరుసగా మూడో రోజూ ప్రతికూల ఫలితమే ఎదురైంది. గుజరాత్, బెంగళూరు తరహాలోనే తాజాగా పంజాబ్ కింగ్స్‌కు పంచ్ పడింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి తప్పుకొన్న ఢిల్లీ క్యాపిటల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టింది. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్‌పై శనివారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 15 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. భారీ ఛేదనలో సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53), స్టొయినిస్ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 44 నాటౌట్), ఇన్‌గ్లిస్ (12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. ముస్తాఫిజుర్‌కు 3.. విప్రజ్, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాహుల్ (35), డుప్లెసి (23) తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఆ తర్వాత కరుణ్ నాయర్ (44) భారీ షాట్లతో విరుచుకుపడగా.. డెత్ ఓవర్లలో సమీర్ రిజ్వీ పంజాబ్ బౌలర్లను ఆడుకున్నాడు. ఆతడికి స్టబ్స్ (18 నాటౌట్) సహకరించడంతో ఢిల్లీ ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. చివరి ఓవర్లో 8 పరుగులే అవసరమవగా, రిజ్వీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. హర్‌ప్రీత్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సమీర్ రిజ్వీ నిలిచాడు.

స్టొయినిస్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయాస్ నిలకడతో పాటు ఆఖర్లో స్టొయినిస్ జోరుతో జట్టు 200 దాటింది. ఓపెనర్ ప్రియాన్ష్ (6) విఫలమైనా ప్రభ్‌సిమ్రన్‌-ఇన్‌గ్లిస్ జోడీ చెలరేగింది. ఆరో ఓవర్లో 6,4 బాది ఇన్‌గ్లిస్ అవుటైనా పవర్‌ప్లేలో జట్టు 60/2 స్కోరు సాధించింది. రెండో వికెట్‌కు వీరు 47 పరుగులు జత చేశారు. విప్రజ్ బౌలింగ్‌లో స్కూప్ షాట్‌కు వెళ్లి ప్రభ్‌సిమ్రన్ బౌల్డయ్యాక ఆటలో కాస్త వేగం తగ్గింది. అయితే శ్రేయాస్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. నేహల్ (16), శశాంక్ (11) విఫలమైనా కెప్టెన్‌కు స్టొయినిస్ సహకరించాడు. 17వ ఓవర్లో ఆతడి 6,6,4.. శ్రేయాస్ 4తో 25 పరుగులు వచ్చాయి. కానీ కుల్దీప్ ఒకే ఓవర్లో శ్రేయాస్, అజ్మతుల్లా (1) వికెట్లు తీశాడు. అయినా 19వ ఓవర్లో మరోసారి చెలరేగిన స్టొయినిస్ 6,4,4,6తో 22 రన్స్ రాబట్టాడు. ముస్తాఫిజుర్ ఆఖరి ఓవర్లో పది పరుగులే ఇచ్చి జాన్సెన్ (0)ను అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 6, ప్రభ్‌సిమ్రన్ (బి) విప్రజ్ 28, ఇన్‌గ్లిస్ (స్టంప్డ్) స్టబ్స్ (బి) విప్రజ్ 32, శ్రేయాస్ (సి) మోహిత్ (బి) కుల్దీప్ 53, నేహల్ (సి) డుప్లెసి (బి) ముకేశ్ 16, శశాంక్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 11, స్టొయినిస్ (నాటౌట్) 44, అజ్మతుల్లా (సి) రిజ్వీ (బి) కుల్దీప్ 1, జాన్సెన్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 0, హర్‌ప్రీత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/8, వికెట్ల పతనం:** 1-8, 2-55, 3-77, 4-118, 5-144, 6-172, 7-174, 8-197; **బౌలింగ్:** ముకేశ్ 4-0-49-1, ముస్తాఫిజుర్ 4-0-33-3, మోహిత్ శర్మ 4-0-47-0, విప్రజ్ 4-0-38-2, కుల్దీప్ 4-0-39-2.

ఢిల్లీ: రాహుల్ (సి) శశాంక్ (బి) జాన్సెన్ 35, డుప్లెసి (సి) ప్రియాన్ష్ (బి) హర్‌ప్రీత్ 23, కరుణ్ నాయర్ (బి) హర్‌ప్రీత్ 44, అటల్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రవీణ్ దూబే 22, సమీర్ రిజ్వీ (నాటౌట్) 58, స్టబ్స్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-55, 2-65, 3-93, 4-155, **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-0, అజ్మతుల్లా 4-0-46-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-41-2, జాన్సెన్ 4-0-41-1, ప్రవీణ్ దూబే 2-0-20-1, స్టొయినిస్ 1.3-0-21-0.

నేటి మ్యాచ్‌లు

గుజరాత్ x చెన్నై — మ.3.30 నుంచి, వేదిక: అహ్మదాబాద్

హైదరాబాద్ x కోల్‌కతా — రా.7.30 నుంచి, వేదిక: ఢిల్లీ

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.737
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

టెస్టుల్లో కొన్నేళ్లుగా జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్, కోహ్లీ ఒక్కసారిగా గుడ్‌బై చెప్పడంతో.. సంధి దశలో ఉన్న టీమిండియాను నడిపించే నవతరం నాయకుడిగా శుభ్‌మన్ గిల్ సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాడు. యువ సారథిగా భవిష్యత్ భారత జట్టును నిర్మించనున్నాడు. ఇంగ్లండ్ టూర్‌తో గిల్ నూతన ప్రస్థానం ఆరంభం కానుంది. ఐపీఎల్‌లో అదరగొడుతున్న సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి రెడ్‌బాల్ జట్టులో చోటు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్‌కు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.

నవతరం నాయకుడు వచ్చాడు



శుభ్‌మన్ గిల్‌కే టెస్టు జట్టు పగ్గాలు

సుదర్శన్, అర్ష్‌దీప్‌కు పిలుపు

- వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్
- బుమ్రా ఆడేది కొన్ని మ్యాచ్‌లే
- ఫిట్‌నెస్ లేమితో షమి అవుట్

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.



అర్ష్‌దీప్



సుదర్శన్



ముంబై: రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత జట్టు పగ్గాలు అందుకునేది ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఊహాగానాలకు తగినట్టుగానే భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. వచ్చేనెల 20 నుంచి జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించే టీమిండియాను శనివారం సెలెక్టర్లు ప్రకటించారు. డాషింగ్ బ్యాటర్, 27 ఏళ్ల రిషభ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత సంధి దశలో ఉన్న భారత జట్టుకు అంతగా అనుభవం లేని 18 మంది సభ్యుల జట్టును సెలెక్టర్లు ఎంపిక చేసి ఒకరకంగా సాహసమే చేశారు. 32 టెస్టులు ఆడిన గిల్ 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. కాగా, ఈ పర్యటన నుంచి పెద్దగా ఆశిస్తున్నదేమీ లేని నేపథ్యంలో గిల్ సాధించే అనుభవం భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని సెలెక్టర్లు చెబుతున్నారు. 'ఏదాది క్రితమే గిల్‌పై దృష్టిసారించాం. భవిష్యత్‌లో భారత జట్టును నడిపించగల సామర్థ్యం ఆతడిలో ఉందని భావించాం' అని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కాగా, సుదీర్ఘ సిరీస్‌కు ఫిట్‌గా ఉండడన్న కారణంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమిని జట్టు నుంచి తప్పించారు. అయితే, వైద్యుల సూచనల మేరకు షమిని పరిగణనలోకి తీసుకోలేదని అగార్కర్ తెలిపాడు. ఆతడి స్థానంలో ఐపీఎల్‌లో అదరగొడుతున్న అర్ష్‌దీప్ సింగ్‌ను తొలిసారి టెస్టులకు ఎంపిక చేసినట్టు చెప్పాడు. 'ఐపీఎల్ సందర్భంగా గతవారం గాయానికి గురైన షమి ఇటీవలే ఎంఆర్‌ఐ స్కాన్ తీయించుకున్నాడు. అయితే, సిరీస్‌కు ఆతను ఫిట్‌గా ఉండడని వైద్యులు తేల్చారు' అని అగార్కర్ తెలిపాడు. మొత్తంగా టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ (2025-27) కోసం భారత జట్టు నిర్మాణం ఇంగ్లండ్ సిరీస్‌తో ఆరంభమవుతోంది. గిల్ భారత టెస్టు జట్టుకు 37వ కెప్టెన్.

నాయర్.. 8 ఏళ్ల తర్వాత

రోహిత్, కోహ్లీ స్థానాల్లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ జట్టులోకొచ్చారు. ఈ ఐపీఎల్‌లో పరుగుల వరదపారిస్తున్న గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు తొలిసారి పిలుపు అందగా.. ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ రీఎంట్రీ ఇచ్చాడు. ఈ ఐపీఎల్‌లో సుదర్శన్ 638 రన్స్ చేసి టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. ఇక, నాయర్ చివరిసారిగా 2017లో టెస్టు ఆడాడు. సెహ్వాగ్ తర్వాత టీమిండియాలో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కిన కరుణ్.. ఆ తర్వాత అంతగా ఆకట్టుకోలేకపోయాడు. కానీ, దేశవాళీలో మెరుగైన ప్రదర్శనతో సెలెక్టర్ల తలుపులు తడుతూనే ఉన్నాడు. అయితే కోహ్లీ రాజీనామాతో నాయర్‌కు అదృష్టం కలిసొచ్చింది. పేసర్ హర్షిత్ రాణా, బ్యాటర్లు శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌లకు జట్టులో చోటు దక్కలేదు. అయితే, సర్ఫరాజ్‌కంటే అనుభవజ్ఞుడైన నాయర్‌కు సెలెక్టర్లు ఓటేశారు. ఆస్ట్రేలియా టూర్‌లో ఆడిన దేవ్‌దత్ పడిక్కల్ ఫిట్‌నెస్ సమస్య లతో చోటు కోల్పోయాడు.

చిన్న వయసులో భారత టెస్టు జట్టు సారథిగా ఎంపికైన ఐదో ఆటగాడు గిల్ (25 ఏళ్ల 258 రోజులు). మన్సూర్ అలీఖాన్ పటౌడి (21 ఏళ్లు), సచిన్ (23 ఏళ్లు), కపిల్ దేవ్ (24 ఏళ్లు), రవిశాస్త్రి (25 ఏళ్ల 229 రోజులు).. గిల్ కంటే ముందున్నారు.



5

బుమ్రాకు ఎందుకు వద్దంటే..?



కెప్టెన్సీ కోసం గిల్‌తోపాటు బుమ్రా పేరు గట్టిగానే వినిపించింది. అయితే, ఫిట్‌నెస్ ఇబ్బందుల కారణంగానే బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించలేదు. అసలు సిరీస్‌లోని ఐదు టెస్టులకు బుమ్రా అందుబాటులో ఉండడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. బుమ్రాపై పని ఒత్తిడి భారం పడకుండా చూడాలని ఫిజియో, వైద్యులు సూచించారు. ఈ క్రమంలో బుమ్రా రెండు, మూడు టెస్టులకే అందుబాటులో ఉండే అవకాశాలున్నాయని అగార్కర్ పేర్కొన్నాడు. రిజర్వ్ ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేశారు. అయితే, బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ సామర్థ్యంపై సందేహాలుండడంతో.. శార్దూల్ ఠాకూర్‌కూ జట్టులో చోటిచ్చారు. శార్దూల్ చివరిగా 2023లో టెస్టు ఆడాడు. గత ఇంగ్లండ్ పర్యటనలో ఓవల్ టెస్ట్‌లో శార్దూల్ వరుసగా అర్ధ శతకాలు బాదడంతో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఇక 'శుభ్' ఆరంభం!

టెస్టుల్లో రోహిత్ వారసుడిగా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు అప్పగించారు. భారత క్రికెట్ వెన్నెముకగా నిలిచిన విరాట్, రోహిత్ దూరమైన వేళ ఈ సంధి దశను అధిగమించేందుకు బీసీసీఐ ఈ యువ ఆటగాడిపై భరోసా ఉంచడం విశేషమే. అరంగేట్రం చేసిన ఐదేళ్లకే కెప్టెన్‌గా అందలం దక్కడంతో గిల్ కెరీర్ గ్రాఫ్ నెటిజన్లు కొనియాడుతున్నారు. 2018 అండర్-19 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీతో గిల్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. అప్పటి కోచ్ ద్రవిడ్ వల్లు బట్టి మరీ గిల్‌ను జట్టులోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ టూర్‌లో ఇండియా 'ఏ' తరఫున రాణించాడు. అలాగే వెస్టిండీస్ 'ఏ'తో జరిగిన టెస్టులో డబుల్ సెంచరీతో వెలుగులోకి వచ్చాడు. కానీ.. చక్కటి టెక్నిక్‌, టెంపర్‌మెంట్ కలిగిన బ్యాటింగ్ కారణంగా 2019లోనే వన్డే జట్టులోకొచ్చాడు. అయితే గిల్ కెరీర్ వెనుక ఆతడి తండ్రి లఖ్వీందర్ కృషి ఎనలేనిది. కొడుకు దృష్టంతా క్రికెట్‌పైనే ఉండేందుకు తమ గ్రామం నుంచి మొహాలీకి మకాం మార్చాడు. కోట్లకొద్దీ నగదు పరుగుల వర్షం కురిపించే ప్రతిభ... హజారుకాలేదు. అప్పటి త్యాగాలకు ప్రస్తుతం మన్ననైన ప్రతిఫలమే దక్కింది. పాతికేళ్ల వయస్సులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టును నడిపించే స్థాయికి ఎదిగాడు. మరోవైపు ఈ ప్రయాణం సుదీర్ఘంగా సాగాలనుకున్న భారత టెస్టు జట్టు గిల్ ఆధ్వర్యంలో శుభ్ ఆరంభాలు కొనసాగాలని ఆశిద్దాం.



ఆ ఇద్దరి లోటు పూడ్చలేనిది: అగార్కర్

జట్టులో రోహిత్, కోహ్లీ లేని లోటును పూడ్చడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. కానీ, రాబోయే ఇంగ్లండ్ టూర్‌లో మిగతా ఆటగాళ్లు ఆ బాధ్యతలు అందుకొంటారని ఆశిస్తున్నట్టు చెప్పాడు. ఈ నెల 7న రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించగా.. 12న కోహ్లీ టెస్టుల నుంచి వైదొలుగుతున్నట్టు బాంబ్ పేల్చాడు. అయితే, చాంపియన్స్ ట్రోఫీ తర్వాత గత నెలలోనే తాను టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలనుకొంటు న్నట్టు కోహ్లీ తనకు చెప్పాడని అగార్కర్ తెలిపాడు.

'25' వేటలో జొకో!

సోనీ లివ్‌లో మ. 2.30 నుంచి

- నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్
- ఫేవరెట్లుగా అల్కారజ్, సినర్



పారిస్: క్లేకోర్ట్ రారాజు రఫెల్ నడాల్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి ఫ్రెంచ్ ఓపెన్‌లో యువ హవా నడవనుంది. డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కారజ్, జానిక్ సినర్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనే అంచనాలున్నాయి. ఆదివారం నుంచి జరిగే టోర్నీలో సినర్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఇక, రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. రోలాండ్ గారోస్‌లోనే ఆ ఫీట్ పూర్తిచేయాలనుకొంటున్నాడు. అయితే, ఆటోసీడ్ జొకోవిచ్, సినర్ ఒకే పార్శ్వంలో ఉండడంతో సెమీస్‌లో ఇద్దరూ తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో మెకెంజీతో జొకో, ఆర్థర్ (ఫ్రాన్స్)తో సినర్ తలపడనున్నారు. క్వాలిఫయర్ జపెర్ (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక ఫేవరెట్ కాగా.. మూడుసార్లు డిఫెండింగ్ చాంప్ స్వియాటెక్, గతేడాది రన్నరప్ పౌలిని, రెండో సీడ్ కోకో గాఫ్ టైటిల్ రేసులో ఉన్నారు.

షూటర్ ముకేశ్‌కు కాంస్యం

సుల్ (జర్మనీ): జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముకేశ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో ముకేశ్ మూడోస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ నరేన్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో కాంస్యం నెగ్గాడు.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం

నాటింగ్‌హామ్: జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 45 పరుగుల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ 565/6 వద్ద డిక్లేర్ చేసింది. కాగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. ఆటకు మూడో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 30/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 255 రన్స్‌కు కుప్పకూలింది.

ఖరీదైన బహుమతులు వచ్చాయా...



ఐటీ రిటర్నుల్లో వెల్లడించాల్సిందే..

భారతీయ సమాజంలో బహుమతులు (గిఫ్ట్) ఒక భాగం. పెళ్లిళ్లు, పేరంటాలు, పండుగల సమయంలో బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయం కూడా. ఇవి నగదుగా, ఆస్తులు లేదా ఇతర విలువైన వస్తువుల రూపంలో ఉంటాయి. ఈ బహుమతులను తీసుకోవడం సంతోషం కలిగించినా.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న బహుమతుల విలువ రూ.50,000 మించితే వాటిపై పన్ను పోటు తప్పదు. ఐటీ రిటర్నులు సమర్పించేటప్పుడు విలువతో సంబంధం లేకుండా ఈ బహుమతుల వివరాలు వెల్లడించడం మంచిది. లేకపోతే భవిష్యత్‌లో నోటీసులు వచ్చే ప్రమాదం ఉంటుంది.

1958లోనే బహుమతులపై పన్ను కోసం ప్రభుత్వం గిఫ్ట్ ట్యాక్స్ యాక్ట్ తీసుకొచ్చింది. 1998లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. అయితే 2004లో మళ్లీ బహుమతులను ఆదాయపు పన్ను (ఐటీ) చట్ట పరిధిలోకి తీసుకొచ్చారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం నిర్ణీత విలువ దాటిన బహుమతులను 'ఇతర ఆదాయం' కింద పరిగణించి వాటిని అందుకున్న వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేస్తారు.

వీరికి మినహాయింపు: ఐటీ చట్టంలో పేర్కొన్న దగ్గరి బంధువులు, కుటుంబసభ్యుల నుంచి అందే బహుమతులకు విలువతో సంబంధం లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఇతరుల నుంచి వస్తే: ఎవరైనా ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో బంధువులు కాని వ్యక్తుల నుంచి రూ.50,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు అందితే వారిపై పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు.

ఎవరు బంధువులు: ఐటీ చట్టం ప్రకారం తల్లిదండ్రులు, తోబుట్టువులు, జీవిత భాగస్వాములు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దగ్గరి బంధువుల పరిధిలోకి వస్తారు. వీరి నుంచి మనకి, మన నుంచి వీరికి అందే బహుమతులకు ఎలాంటి పన్ను వర్తించదు.

పన్ను పోటు లేని బహుమతులు

- పెళ్లి సమయంలో వధూవరులకు వచ్చే గిఫ్ట్‌లు
- ఐటీ చట్టం పేర్కొన్న దగ్గరి బంధువుల నుంచి అందే బహుమతులు
- వారసత్వంగా లేదా వీలునామా ద్వారా సంక్రమించే గిఫ్ట్‌లు
- ప్రభుత్వ వద్ద నమోదైన మతపరమైన, దాతృత్వ ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి అందే గిఫ్ట్‌లు
- యూనివర్సిటీలు, విద్యా సంస్థల నుంచి అందే ఉపకార వేతనాలు, గ్రాంట్లు, ఆర్థిక సాయం
- మున్సిపల్, స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి అందే బహుమతులు
- కేవలం ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ఏర్పాటైన ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- యాజమాన్య హక్కుల బదిలీ లేకుండా అందే బహుమతులు
- కార్లు, ఫోన్లు, టీవీలు, ఫర్నీచర్, వాచీల వంటి బహుమతులకు విలువ రూ.50,000 మించినా పన్ను పోటు ఉండదు.

రిటర్నుల్లో ఎలా వెల్లడించాలి?

ఒక ఆర్థిక సంవత్సరంలో అందే బహుమతుల విలువ రూ.50,000 మించితే తప్పనిసరిగా ఆ వివరాలను 'ఇతర ఆదాయం' సెక్షన్‌లో వెల్లడించాలి. ఒకవేళ వాటి విలువ రూ.50,000 కంటే తక్కువగా ఉన్నా 'ఎగ్జెంప్ట్ ఇన్‌కమ్' సెక్షన్‌లో వెల్లడించడం మంచిది. దీనివల్ల మన ఆదాయ వెల్లడిలో పారదర్శకత పెరిగి ఐటీ శాఖ మన రిటర్నులు స్క్రూటినీ చేసే అవకాశాలూ తగ్గుతాయి.

బిజినెస్ ప్లస్

క్రెడిట్ కార్డుతో నగదు తీసుకుంటున్నారా..



తొలి రోజు నుంచే వడ్డీ

ఎప్పుడు ఎవరికి ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. ఆ సమయంలో చేతిలో డబ్బులు ఉంటాయనే గ్యారెంటీ లేదు. అప్పుడు బంధుమిత్రుల నుంచి లేదా బ్యాంకు నుంచి అప్పు చేయక తప్పదు. ఇవేవీ సాధ్యం కాకపోతే క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం ఒక్కటే మార్గం. అయితే ఇది అంత క్షేమం కాదు. ఇందుకు అధిక వడ్డీతో పాటు చార్జీలు రూపంలో భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు ద్వారా అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌లో ఉన్న సమస్యలు ఏమిటో తెలుసుకుందాం...

జాగ్రత్తలు తీసుకోకపోతే గుదిబండగా మారే ప్రమాదం

చార్జీలు: క్రెడిట్ కార్డు అంటేనే ఫీజులు, వడ్డీలు. ఇక ఈ కార్డులతో విత్‌డ్రా చేసే అడ్వాన్స్ నగదుపై వడ్డీ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతి నగదు విత్‌డ్రాయల్‌పైనా కనీసం రూ.250 నుంచి రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. విత్‌డ్రా చేసే నగదును బట్టి ప్రతి లావాదేవీ విలువలో ఇది 2.5 శాతం నుంచి 3 శాతం వరకు ఉంటుంది. క్రెడిట్ కార్డు కంపెనీలు జారీ చేసే బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లో ఈ చార్జీల వివరాలు ఉంటాయి.

వడ్డీ రేటు: క్రెడిట్ కార్డుల ద్వారా విత్‌డ్రా చేసే నగదు అడ్వాన్స్‌లపై బ్యాంకులు నెలవారీ పద్ధతిలో వడ్డీ రేటు వసూలు చేస్తాయి. సాధారణంగా ఈ వడ్డీ రేటు 2.5 నుంచి 3 శాతం మధ్య ఉంటుంది.

లేటు చెల్లింపులు వద్దు: ఈ చెల్లింపులను ఒకేసారి వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది. చేతిలో డబ్బులు లేవని కొద్దికొద్దిగా ఇన్‌స్టాల్‌మెంట్లలో చెల్లిస్తే ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. సాధారణంగా ఇది మిగిలిన బకాయి మొత్తంలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. ఆలస్యంగా చేసే అడ్వాన్స్ నగదు చెల్లింపులు ఆర్థిక భారంతో పాటు క్రెడిట్ స్కోరును దెబ్బతీస్తాయి.

క్రెడిట్ కార్డుపై కొనే వస్తువుల బకాయిలు చెల్లించేందుకు కొంత ఇంటరెస్ట్ ఫ్రీ గడువు ఉంటుంది. అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌కు ఇలాంటి సౌలభ్యం ఉండదు. నగదు విత్‌డ్రా చేసిన రోజు నుంచే చెల్లించే రోజు వరకు వడ్డీ భారం పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌ను ఎంత త్వరగా చెల్లిస్తే అంత మంచిది.

పరిమితులు

క్రెడిట్ కార్డు చేతిలో ఉన్నంత మాత్రాన ఎంత పడితే అంత అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్ కుదరవు. మీ క్రెడిట్ కార్డు క్రెడిట్ లిమిట్‌లో ఒక పరిమితికి లోబడి మాత్రమే ఈ నగదు ఉపసంహరణ సాధ్యం. ఒకవేళ దీన్ని ఉపయోగించుకున్నా ఆ మొత్తాన్ని నిర్ణీత గడువు లోగా ఒకేసారి చెల్లించాలి. లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం ఉంది.



ఎల్ఐసీ గిన్నిస్ వరల్డ్ రికార్డు

ఒక్క రోజులో 5,88,107 పాలసీల విక్రయం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఒక్క రోజులో ఇన్ని పాలసీలు అమ్మిన బీమా కంపెనీ ఇదే. ఈ జనవరి 20న సంస్థకు చెందిన 4,52,839 ఏజెంట్లు ఈ పాలసీలను విక్రయించినట్టు ఎల్ఐసీ వెల్లడించింది. "ఇది మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, నైతికతకు బలమైన ప్రతీకగా నిలుస్తుంది. మా కస్టమర్లు, వారి కుటుంబాలకు బీమా ద్వారా ఆర్థిక రక్షణ కల్పించాలన్న మా లక్ష్యం పట్ల నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది" అని ఎల్ఐసీ పేర్కొంది. 'మ్యాడ్ మిలియన్ డే' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ జనవరి 20న ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీనైనా విక్రయించాలని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి కోరారు. దాంతో ఏజెంట్లందరూ కలిసి రికార్డు స్థాయిలో పాలసీలను విక్రయించారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ

హైదరాబాద్	500	విజయవాడ	510
వరంగల్	502	గోదావరి	485
చిత్తూరు	603	విశాఖపట్నం	513
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,080 ▲	89,900 ▲	1,10,900 ▼
విజయవాడ	99,700 ▲	93,500 ▲	99,700 ▼
విశాఖపట్నం	98,080 ▼	89,900 ▲	1,10,900 ▲
రాజమండ్రి	98,070 ▲	89,900 ▲	1,03,000 ▲
ప్రొద్దుటూరు	96,200 ▼	88,500 ▼	99,200 ▼
ముంబై	95,471	87,451	96,909

బేకరీల్లో తనిఖీలు
- రూ.10,500 జరిమానా

కోరుట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు రెస్టారెంట్, బేకరీ, దాబాలలో మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం దాడులు నిర్వహించారు. రెస్టారెంట్, బేకరీ, దాబాలలో ప్లాస్టిక్ నిలువలను స్వాధీనం చేసుకోన్నారు. అదే విధంగా పట్టణంలోని పలు ప్లాస్టిక్ దుకాణలపై దాడులు నిర్వహించి సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోని పలు దుకాణాలలో సుమారు రూ.10,500 వరకు జరిమాలను విధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆశోక్, రాజేంద్రప్రసాద్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది హేమంత్, రమేష్, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

బుగ్గారం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎల్ ఎఫ్ ఎల్ హెచ్‌ఎం లు, ఎస్జీటీలకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు బోధన నైపుణ్యాలు మెరుగుపరచడానికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు పరచి విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని సూచిం చారు. అనంతరం ఆర్పీలుగా వ్యవహరించిన ప్రకాష్, రాజేష్, సతీష్ రావు, తిరుపతి లను, శిక్షణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న ఉపాధ్యాయులు రఘునందన్, ప్రణీత్, మౌనికలను శాలువా కప్పి సన్మానించారు. పీఆర్టీయు మండల శాఖ తరపున చీట్నేని విజయకుమార్ ఎంఈఓ, ఎం ఆర్ సి సిబ్బంది, ఆర్పీలకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్పి పురుషోత్తం, ఎం ఐ ఎస్ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●బీర్‌పూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో ఈ నెల 20నా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గత ఐదు రోజులుగా ఉపాధ్యాయులకు శిక్షణ అందించిన ఆర్పిలను శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ఎంఈవో నాగభూషణం, ఆర్పిలు, ఉపాధ్యాయులు, సిఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

బీర్‌పూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలోని మోతినగర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా ధాన్యం తడిసి మొలకెత్తిన ధాన్యాని చూసిన రైతులు ఆందోళన చెందుతూ తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అధికారులను కోరారు.

దేశభక్తిని పెంపొందించడానికే తిరంగా యాత్ర
-బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు

రాయికల్, మే 24 (ఆంధ్రజ్యోతి): దేశభక్తికి పెంపొందించడానికే తిరంగా యాత్ర చేపట్టినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై రాయికల్‌లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం పాత బస్టాండ్ నుంచి భరతమాత విగ్రహం వరకు తిరంగాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన త్రివిధ దళాల శక్తి ముందు పాకిస్తాన్ తలవంచిందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వడ్డేపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఆకుల మహేష్, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, బన్న సంజీవ్, కునారపు భూమేష్, శ్రీకాంత్ రెడ్డి, సతీష్, సాయిరాజు గౌడ్, నరేందర్, నాయకులు కుర్మ నారాయణరెడ్డి, మల్లారెడ్డి, పాల్గొన్నారు.


మెట్‌పల్లిలో తిరంగా యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

●మెట్‌పల్లిటౌన్: బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ నాయకత్వంలో శనివారం పట్టణంలో ఘనంగా తిరంగాయాత్ర నిర్వహించారు. పట్టణంలో ప్రధాన జాతీయ రహదారి వెంబడి పాత బస్టాండ్ వరకు తిరంగ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత సైన్యం ప్రదర్శించిన ధైర్యసాహసాలు, దేశ రక్షణకు చేసిన సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు యాదగిరిబాబు, బీజేపీ రాష్ట్ర నాయకులు డా.రఘు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి వడ్డెపల్లి శ్రీనివాస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ నరేందర్ రెడ్డి, కోకన్వీనర్ గుంటుక సదాశివం, బీజేపీ జిల్లా నాయకులు చెట్లపల్లి మీనా, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

●ధర్మపురి: ధర్మపురి పట్టణంలో సిటిజెన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో భారత సాయుధ దళాల గౌరవ సూచకంగా తిరంగాయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా ఈ యాత్ర చేపట్టారు. భారత దేశ ఐక్యత, దేశభక్తి, సమైక్యతను ప్రజలకు చాటి చెప్పే ఉద్దేశ్యంతో చేపట్టిన ఈ యాత్ర స్థానిక నంది విగ్రహ చౌరస్తా నుండి ప్రారంభమై గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల ప్రజలు పాల్గొన్నారు.

●మల్లాపూర్: ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకోని త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా మల్లాపూర్ శనివారం ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ప్రధాన వీధుల్లో జరిపిన కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, యువకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి
-జిల్లా విద్యాధికారి రాములు


మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాములు

కోరుట్ల, మే 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలని జిల్లా విద్యాధికారి రాములు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర విద్యా విధానంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను జిల్లా విద్యాధికారి రాములు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనలో మెళకువలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్ రావు, రిసోర్స్ పర్సన్ ఆందె శివప్రసాద్, మాసం చిరంజీవి, కోసరి శేఖర్, గంగుల రణదీర్, అన్నం మహేష్, సిరుపురం రాకేష్, అంకం దామెదర్, సీఆర్‌పీలు గంగాదర్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

చారిత్రక వైభవాన్ని భావి తరాలకు అందించాలి

రాయికల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మన దేశ చారిత్రక వైభవాన్ని భావి తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాధికారి రాము నాయక్ అన్నారు. రాయికల్ పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. అనంతరం పట్టణంలోని చారిత్రక కట్టడమైన త్రికూటాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మచ్చ శ్రీధర్, ప్రధాన అర్చకుడు సతీష్ శర్మ, ఉపాధ్యాయ సంఘం నాయకులు వేల్పుల స్వామి యాదవ్, చెరుకు మహేశ్వర శర్మ, పొన్నం రమేష్ గౌడ్, గాజెంగి రాజేశం, జితేందర్ రెడ్డి, అక్కినపెల్లి సతీష్, రాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కుటుంబసభ్యులకు పరామర్శ

కోరుట్ల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వరాజుపూర్ గ్రామంలోని మావోయిస్టు మాజీ నేత నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందంగా ఆయన కుటుంబాన్ని శనివారం బీసీ కమీషన్ రాష్ట్ర మాజీ చైర్మెన్ రాములు పరామర్శించారు. నారాయణ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళ్లను అర్పించి ప్రగాడ సంతాపంను ప్రకటించారు. నారాయణ మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్లూర్ గ్రామ మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్యలతో పాటు నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలతో భూసారం పెంపు

ధర్మపురి, మే 24 (ఆంధ్రజ్యోతి): రైతులు జీలుగ విత్తనాలు వాడి భూసారం పెంపొందించుకుని అధిక దిగుబడి సాధించాలని ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య అన్నారు. ధర్మపురి పీఏసీఎస్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు జీలుగ విత్తనాలు శనివారం ఆమె పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టదారు పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుక వచ్చి కార్యాయంలో సంప్రదించాలని తెలిపారు. అకాల వర్షం వల్ల తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనబట్ల దినేష్, ధర్మపురి మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరు రాజేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, పాలకవర్గ సభ్యులు కాశెట్టి రాజేష్, తొట్ల రాజన్న, ఎన్నం మదుకర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, ఏఈవో నవ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మల్యాల, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారంకు చెందిన శీలం మానస అనే మహిళ బుధవారం బట్టలు ఆరవేస్తుండగా డిష్ తీగలు తగిలి విద్యుద్ఘాతంతో మృతి చెందగా బాదిత కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరుపున మంజూరైన రూ.25వేల ఆర్థిక సహాయంను తహసీల్దార్ మునీందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయసింహరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు

జగిత్యాల అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో శనివారం రాజీవ్ యువ వికాస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ ఇంటర్వ్యూలకు 950 మంది అభ్యర్థులు హాజరైయినట్లు మున్సిపల్ కమిషనర్ స్పందన తెలిపారు. పట్టణంలో 6 వేల మంది దరఖాస్తు చేసుకోగా మిగతా వారికి ఆది, సోమవారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించ నున్నట్లు ఆమె తెలిపారు.

●మెట్‌పల్లి రూరల్: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను రెండో రోజు శనివారం మండల ప్రజా పరిషత్ కార్యక్రమంలో నిర్వహించినట్లు ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్‌కు 371 మందిని ఇంటర్వ్యూలకు పిలవగా 330 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని తెలిపారు.

●కొడిమ్యాల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఇంటర్వ్యూలకు 538మంది హాజరైనట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు.

●ఎండపల్లి: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జిల్లా పరిషత్ పాఠశాలలో ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్, బ్యాంకు అధికారులు సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 939 మందికి గాను 671 మంది హాజరయ్యారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, మే 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. వైశాఖ మాసం తోడుగా సెలవు దినాలు కావడం వల్ల ఉదయం వరకు క్షేత్రం భక్తులతో రద్దీగా అగుపించింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి పోయారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, చిలుకముక్కు రమణాచారి, నంబి నరసింహమూర్తి నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకోవటం అగుపించింది. ఇదిలా ఉండగా సరస్వతి పుష్కరాలకు హాజరైన భక్తులు స్వామి దర్శనం కోసం క్షేత్రానికి తరలి వచ్చారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సేవలు అందించారు.

ఉద్యోగం ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి

మెట్‌పల్లిటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణ గ్రంథాలయంలో రెండు దశాబ్దాలకు పైగా పార్ట్‌టైం స్వీపర్‌గా పనిచేస్తున్న తనను అకారణంగా విధుల నుంచి లైబ్రేరియన్ తొలగించారని, తిరిగి తనను విధుల్లోకి తీసుకోవాలని నిమ్మగంగు అనే మహిళ శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. పార్ట్‌టైం పేరుతో నేను పని చేస్తున్నప్పటికీ ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తున్నానన్నారు. బంధువులు మరణించినప్పటికీ సెలవు ఇవ్వమంటే లైబ్రేరియన్ ఇవ్వలేదని ఆరోపించింది. పాఠకుల ముందు బూతులు తిడుతూ కుర్చీలతో దాడి చేసి గాయపరిచాడని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అతి తక్కువ వేత నానికి పనిచేస్తున్న తనను అకారణంగా పక్కనపెట్టి మరొకరిని విధుల్లోకి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

బీర్‌పూర్,మే 24(ఆంధ్రజ్యోతి):ఎలాంటి సాకులు చెప్పకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలంలోని కందెనకుంటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తులు ఉన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

ఇబ్రహీంపట్నం, మే 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తమ ఎస్‌ఎచ్‌ఓగా రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా సన్మానం పొందిన ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్‌ను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీం పట్నం ఏఎంసి చైర్మన్ బోరిగాం రాజు, వైస్ చైర్మన్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

జగిత్యాల అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఇందిరాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు అండగా ఉండేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్ పాల్గొన్నారు.

●పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను జగిత్యాల పట్టణంలోని గాయత్రి అనాథ వృద్ధుల ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం పాల్గొన్నారు.

●కోరుట్ల: పట్టణంలోని జువ్వాడి భవనంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

●కొడిమ్యాల: టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు అంజన్‌కుమార్, మండల నాయకులు నారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, ముత్యం శంకర్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, నాగభూషణ్‌రెడ్డి, స్వామి, గంగన్న, మల్లేశం, చంద్రమొహన్‌రెడ్డి, హుస్సేన్, రవి, నర్సయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

●పెగడపల్లి: టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, నాయకులు అనిల్‌గౌడ్, మల్లారెడ్డి, మల్లేశం, సుధీర్, కిషన్, మహేష్, ప్రశాంత్, ప్రవీణ్‌కుమార్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

●మల్యాల: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను మల్యాలలోని సోనియాగాంధీ గుడి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ వైద్యుల అంజన్‌కుమార్, దొంగ ఆనందరెడ్డి, ముత్యం శంకర్, రాంలింగారెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శనిగారపు తిరుపతి, దారం ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, సతీశ్‌రెడ్డి, లక్ష్మనాచారీ, ప్రసాద్, మ్యాక లక్ష్మన్, ప్రతాప్, సంజీవ్, అనిల్, వినయ్, హరినాథ్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతను పెంపొందించాలి

మెట్‌పల్లి రూరల్, మే, 24 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి, మన సైన్యం శక్తి ఏంటో ప్రపంచానికి చాటి చెప్పడం జరిగిందని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఉపాధ్యాయులు భారత సైన్యం విజయానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు విద్యార్థులలో జాతీయ సమైక్యతను పెంపొందించడం కృషి చేయాలని, ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. గ్రామాల్లోని సైనికుల తల్లిదండ్రులను జాతీయ పండుగలకు ఆహ్వానించాలని, వారికి తగిన గౌరవాన్ని కల్పిస్తూ సైనికుల త్యాగాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నర్సాగౌడ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన భారత సైన్యానికి ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం వద్ద ఉపాధ్యాయులు శనివారం జాతీయ జెండాలను చేతబట్టుకుని నినాదాలు చేస్తూ మద్దతు ప్రకటించారు.

కోతకు గురైన అప్రోచ్‌రోడ్డు
ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, రైతులు -మరమ్మతు చేయించాలని వినతి


కోతకు గురైన బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు

కొడిమ్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొడిమ్యాల, నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా మట్టితో నిర్మించిన అప్రోచ్ రోడ్డు కొడిమ్యాల వైపు దెబ్బతిన్నది. గత ప్రభుత్వం 4.8 కోట్ల రూపాయలను డీఎంఎఫ్‌టీ నిదులు నుంచి విడుదల చేయగా బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. బ్రిడ్జికి రెండువైపులా నిర్మించిన రాతి తెట్టె పొడవును పెంచినట్లయితే మట్టి కట్ట కోతకు గురికాకుండా ఉంటుందన్న అభిప్రాయాలను పలువురు వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు పట్టించుకొని దెబ్బతిన్న మట్టి కట్ట మరమ్మతు చేయించాలని మండల ప్రజలు, పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈఈ పి.సత్యనారాయణను వివరణ కోరగా బ్రిడ్జికి ఇరువైపులా డాంబర్ వేసే ముందు మరమ్మతు చేయిస్తామన్నారు.

మట్టి కట్టను పటిష్టంగా నిర్మించాలి
-దోమకొండ నర్సయ్య, రైతు, కొడిమ్యాల



కొడిమ్యాల, నాచుపల్లి గ్రామాల మధ్య నున్న వాగుపై నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా మట్టి కట్టను పటిష్టంగా నిర్మించాలి. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న కంకర రోడ్డుపై డాంబర్ వేయాలి.

మరమ్మతు చేయించాలి
-పర్లపెల్లి మహిపాల్, కొడిమ్యాల



బ్రిడ్జికి ఇరువైపులా నిర్మించిన మట్టి కట్ట ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతు చేయించాలి. ఈ బ్రిడ్జికి ఇరువైపులా 40 నుండి 50 మీటర్ల వరకు రాతి తెట్టెను నిర్మించినట్లయితే వర్షాలకు కోతకు గురికాకుండా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించాలి.

వాహనాలకు వేలం

మెట్‌పల్లి రూరల్, మే24 (ఆంధ్రజ్యోతి): అక్రమ నాటుసారా, బెల్లం సరఫరాల చేసి పట్టుబడిన వాహనాలకు వేలం పాల వేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ శనివారం మెట్‌పల్లి సీఐ వినోద్‌రాథోడ్ తెలిపారు. మెట్‌పల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమం కేసులో పట్టుకున్న వాహనాలకు డిప్యూటీ కమిషనర్ కరీంనగర్ ఆదేశాల మేరకు ఈనెల 26న 11 గంటలకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మెట్‌పల్లిటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమృత (డిఎస్ టవర్స్) ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని డిఎస్ టవర్స్‌లో రెనె ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నాట్లు నాయకులు మహాజన్ నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత వైద్య శిబిరంలో వివిధ రకాల ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నాట్లు తెలిపారు.ఉచిత వైద్య శిబిరంను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి


దరఖాస్తులను స్వీకరిస్తున్న కాంగ్రెస్ జిల్లా పరిశీలకుడు

కొడిమ్యాల, మే 24(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల, బ్లాక్, గ్రామ కమిటీల దరఖాస్తులను ఆయన స్వీకరించారు. అనంతరం పరిశీలకుడు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సూచించిన అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకపోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీపై బీజేపీ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజనర్సింగరావు, ముత్యం శంకర్‌గౌడ్, నాగభూషణ్ రెడ్డి, మల్లేశం, మల్లిఖార్జున్‌రెడ్డి, స్వామి, పాపిరెడ్డి, చంద్రమొహన్‌రెడ్డి, గంగన్న, నర్సయ్య, జితెందర్‌రెడ్డి, రవి, సత్యం, రమేష్, హుస్సేన్, చంద్రారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మల్యాల, మే 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి, గ్రామ శాఖ అధ్యక్ష పదవులకు శనివారం మల్యాలలో టీపీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ అంజన్‌కుమార్ పార్టీ శ్రేణుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో అత్యధికంగా పదుల సంఖ్యలో కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి దరఖాస్తులు చేసుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సైతం దరఖాస్తులు అందించారు.

సౌదీ అరేబియాలో తెలుగు సంఘం

రాయికల్, మే 24 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో తెలుగు అసోసియేషన్ ఫౌండర్ మల్లేష్ ఆధ్వర్యంలో శనివారం సాటా-రియాద్ చాప్టర్ కోర్ టీమ్ తెలుగు సంఘాన్ని ఏర్పాటు చేశారు. రియాద్ చాప్టర్ అధ్యక్షునిగా మచ్చ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా నూర్ మహ్మద్, ఇంజనీరింగ్ చాప్టర్ అధ్యక్షునిగా సింగు నరేష్ కుమార్‌ను, బిజినెస్ చాప్టర్ అధ్యక్షునిగా వీరవెల్లి యోగేశ్వర్ రావును, టీచర్స్ చాప్టర్ అధ్యక్షునిగా మురళిని ఎన్నుకున్నారు. ఎలాంటి కుల, మత బేధం లేకుండా మనమందరం కలిసి కష్టాల్లో ఉన్న తెలుగువారికి అన్ని విధాలా సహాయం చేసుకుంటూ ముందుకువెళ్లాలని కోరారు. కోర్ టీమ్ సభ్యులుగా శహబాబ్, మిధున సురేష్, ముదిగొండ శంకర్, నయీం, అయాజ్, ముజామిల్లోద్దీన్, ఇలియాస్, కోకిల, మంజూషమహేష్‌లు ఎన్నికయ్యారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పాలీసెట్ 2025 ప్రవేశ పరీక్షలో కోరుట్ల మండలంలోని విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని అక్షర పాఠశాలకు చెందిన పాలెపు కార్తికేయ రాష్ట్ర స్థాయిలో 53వ ర్యాంకు సాదించినట్లు కరస్పాండెంట్ వెంకట సిద్ధార్థ తెలిపారు. అదే విధంగా పాఠశాలలో చదివిన ఆదిత్య రాహుల రాష్ట్ర స్థాయిలో 2035, కోట శశాంక్ 2100 ర్యాంకు సాదించినట్లు ఆయన తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ వెంకట సిద్ధార్థ, డైరెక్టర్ ప్రియాంక, ప్రధానోపాధ్యాయుడు సతీష్‌లు అభినందించారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

మల్యాల, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాపూర్ గ్రామ పరిధిలోని కొత్తపల్లెలో అంబెద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబెద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తుండడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.20వేల నగదు పంపించగా సంఘ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తినిమల్లీశ్వరీ శ్రీనివాస్ గౌడ్, ఆనందరెడ్డి, మ్యాక లక్ష్మన్, చంద్రశేఖర్, శనిగారపు తిరుపతి, నక్క అనిల్, జంగిలి హనుమంతు, సదాశివరెడ్డి, లక్ష్మణాచారీ, బండి రవి, బీటీ.రమణ, సంజీవ్ పాల్గొన్నారు.